**కథ**

# మరచిపో నేస్తమా

**ఓ సాంస్కృతిక సంస్థ నిర్వహిస్తున్న కల్చరల్ ప్రోగ్రాంకు హాజరైంది గీతాంజలి. ఇంకా ప్రోగ్రాం మొదలుకాలేదు. ఇంతలో ఆమె దృష్టి హాలు లోపలికి వస్తున్న ఆ జంటపై పడింది.**

వాళ్ళు అన్ని ప్రోగ్రాములకూ వచ్చారు. ఇద్దరూ అందంగా ఉంటారు. అన్యోన్యమయిన జంట కూడా అయివుంటారు తప్పకుండా. ప్రోగ్రాంకు వచ్చిన చాలామంది అతనితో మాట్లాడుతుంటారు. ఆమెకు యింకా ఆ అవకాశం రాలేదు. అయితే అతనెవరో, ఏం చేస్తూంటాడో, వాళ్ళకు పిల్లలెంతమందో తెలుసుకోవాలని ఆమెకు ఉంది. ఇంటర్వెల్‌లో హాలు బయటకు వచ్చింది.

అక్కడ కూల్‌డ్రింక్ త్రాగుతున్న అతన్ని చూసింది. 'అదేమిటి. భార్యకు యివ్వకుండా తనొక్కడే త్రాగుతున్నాడు' అనుకుంది. తను కూడా ఓ కూల్‌డ్రింక్ త్రాగింది. తర్వాత పాప్‌కార్న్ పేకెట్ ఒకటి కొన్నది. కాస్త ఆలస్యంగా కూల్‌డ్రింక్ త్రాగడం పూర్తి చేసిన అతను 'పాప్‌కార్న్ ఓ పేకెట్' అంటూ స్టాల్ అతనితో అన్నాడు.

''సారీ సార్. ఒకే పేకెట్ ఉంటే మేడమ్‌గారు కొన్నారు'' గీతాంజలి వైపు చూపిస్తూ అన్నాడు స్టాల్ అతను.

''అరెరే'' బాధగా అన్నాడు అతను.

''పోనీ. ఇది మీరు తీసుకోండి'' అంది ఆమె పేకెట్ అతనికిస్తూ.

''థాంక్సండీ. ఫర్వాలేదు. మీకోసం కొన్నారు కదా. ఉంచండి''

''ఫర్వాలేదు తీసుకోండి. మీ ఆవిడ కోసమేగా''

''భలే ఊహించారే. తనకు జలుబుగా ఉందని కూల్‌డ్రింక్ వద్దంది. తనకు పాప్‌కార్న్ అయినా తీసుకెళదామని అనుకొన్నాను. సారీ''

''ఫర్వాలేదు''

దాని ఖరీదు ఆమెకివ్వబోయాడు కానీ ఆమె వారించింది.

''థాంక్యూ'' అంటూ వెళ్ళిపోయాడు. పాప్‌కార్న్ తింటూ మాట్లాడుకొంటున్న వాళ్ళిద్దర్నీ చూస్తూంటే తను ఏదో పోగొట్టుకొన్న ఫీలింగ్ కలిగింది గీతాంజలికి.

★ ★ ★

వారం రోజుల తర్వాత మరో ప్రోగ్రాంలో కలిశారు వాళ్ళు.

''హలో'' అన్నాడు అతను పలకరింపుగా.

''హలో... ఒంటరిగా వచ్చినట్లున్నారు''

''అవును. మా ఆవిడ ఊరెళ్ళింది. పుట్టింటికి''

ఆమె నవ్వి ''ఎందరు పిల్లలు'' అని అడిగింది.

''ఇద్దరు. ఇద్దరూ ఆడపిల్లలే. కవలలు''

''అయితే మీరు 'ఆడపిల్లల తండ్రి' అన్నమాట''

''ఉన్నమాటే. నా పేరు శశాంక. ఛార్టెడ్ అక్కౌంటెంట్ని''

''నా పేరు గీతాంజలి. ఎల్.ఐ.సి.లో ఆఫీసర్ని''

ఆ ప్రోగ్రాంలో శశాంక ప్రక్కనే కూర్చుంది గీతాంజలి. ఎందుకో తను అతని భార్య స్థానంలో కూర్చున్న భావన కలిగింది ఆమెకు. ఆ భావన ఆమెకు ఓ రకంగా సంతోషాన్ని కలిగించింది. అతను మాత్రం ఉత్సాహంగా మాట్లాడుతూనే ఉన్నాడు. తన గురించి చెప్పాడు. ఆమె గురించి తెలుసుకొన్నాడు. తన విజిటింగ్ కార్డ్ యిచ్చాడు. ఆమె కార్డు అడిగి తీసుకొన్నాడు. తనింటికి ఒకసారి రమ్మని ఆహ్వానించాడు ఆమెను.

''తప్పకుండా. నాకు మీ అమ్మాయిల్ని చూడాలని వుంది. ఓ.కే. గుడ్‌నైట్''

''గుడ్‌నైట్'' అంటూ తన కారు వైపు నడిచాడు శశాంక.

రెండు రోజుల తర్వాత రాత్రి ఏడు గంటలకు ఫోన్ మ్రోగితే రిసీవర్ తీశాడు శశాంక.

''హలో. శశాంక హియర్''

''ఊహించండి నేనెవరో?''

''మీరు..సారీ..కనుక్కోలేకపోతున్నాను''

''పోనీ చిన్న క్లూ యిస్తాను. మన పరిచయం ఈమధ్యనే జరిగింది''

''గీతాంజలిగారా?''

''కరెక్ట్. ఏం చేస్తున్నారు?''

''ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాను''

''కాపీ డైలాగు యిది''

''కాదు. టీ త్రాగుతూ చెప్పిన డైలాగ్''

అటుప్రక్క నుంచి ఆమె నవ్వు వినిపించింది.

''మీ ఆవిడ ఊరి నుంచి వచ్చారా?''

''ఇంకో వారం రోజుల దాకా రాదు. చాలా కాలం తర్వాత పుట్టింటికి వెళ్ళింది తను''

''వంట మీరేనా?''

''అది మా యింటా, వంటా లేదు''

''పోనీ మా యింటికి రండి''

''ఫర్వాలేదు. మా అమ్మాయిలు అద్భుతంగా వంట చేస్తారు''

''అంత పెద్దవాళ్ళా వాళ్ళు?''

''పదవ తరగతి చదువుతున్నారు కనుక పెద్దవాళ్ళ క్రిందే లెఖ్ఖ''

''వెరీగుడ్. మీరు ఆడువారా? పాడువారా?''

''ఆడుతూ పాడుతూ ఉంటాను''

''నా ఉద్దేశ్యం మీ హాబీస్ ఏమిటి అని''

''క్రికెట్ ఆడతాను. సంగీతం వింటాను. సాహిత్యం చదువుతాను. వ్యాయామం చేస్తాను. భగవంతుడు అవకాశం యిచ్చినప్పుడు పదిమందికి సహాయపడుతుంటాను''

''చాలా మంచి హాబీస్ మీవి. మీ అమ్మాయిలకు సంగీతం నేర్పించారా?''

''వాళ్ళు వీణ ధరించిన సరస్వతి అవుతారని ఆశించాను. కానీ పుస్తకం ధరించిన సరస్వతి అయ్యారు''

''మంచిదేగా. మీరు అదృష్టవంతులు''

''థాంక్స్. మరి మీ హాబీస్ ఏమిటి?''

''ఇలా ఫోన్ చేసి మీ బుర్ర తింటూండటం. ఈరోజుకు యిక చాలు. ఉంటానండీ. గుడ్‌నైట్''

''గుడ్‌నైట్''

★ ★ ★

కొద్దిరోజుల్లోనే గీతాంజలి- శశాంక ఫ్యామిలీతో బాగా కలిసిపోయింది. తన ఇన్‌కంటాక్స్ రిటర్న్ ఫైల్ చేయడంలో శశాంక సహాయం పొందింది. ఆ విషయంగా ఆమె అతని ఆఫీసుకు పలుసార్లు రావడంతో వాళ్ళిద్దరి మధ్యా చనువు పెరిగింది.

ఒకరోజు ఆఫీసులో పనిచేసుకుంటున్న శశాంక ఎదురుగా వచ్చి నిలబడింది గీతాంజలి. తలెత్తి చూసిన శశాంక ఆశ్చర్యపోతూ ''రండి. కూర్చోండి'' అన్నాడు.

కుర్చీలో కూర్చుంటూ ''ఏమ్ ఐ డిస్టర్బింగ్ యూ'' అంది.

''అవును. ఇటీజ్ ఎ స్వీట్ డిస్టర్‌బెన్స్''

''మీరు చాలా బాగా మాట్లాడతారు''

''నాకున్న ఏకైక అస్సెట్ అదే''

''అదేమిటండీ అలా అంటారు. అందమైన భార్యాపిల్లలు, మంచి ప్రాక్టీసు, యిల్లూ, కారు

యివన్నీ అసెట్సే కదా. పైగా అందంగా కూడా ఉంటారు. మీకు పెళ్లైన విషయం తెలియని అమ్మాయిలు మిమ్మల్ని ప్రేమించే అవకాశం కూడా లేకపోలేదు''

''ఇంకో ఏడు సంవత్సరాల్లో మా అమ్మాయిలకి పెళ్ళి చేయాలి నేను''

''మీ వయసును ఉత్సాహంతో దాస్తున్నారో, రంగులతో దాస్తున్నారో తెలియదుగానీ అంత వయసున్నట్టు కనబడరు.''

''మీ వయసెంతో చెప్పండి''

''మగవాడి జీతం, ఆడదాని వయసు అడగ రాదు''

''అది ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయని రోజుల్లో అన్నమాట''

''నా వయసు పదహారు''

''ఇరవై ఏళ్ళ క్రిందట చెప్పిన నెంబరే యిప్పుడూ చెప్తున్నారు''

''ఒక్కోసారి ఒక్కోమాట మాట్లాడటం నాకు అలవాటు లేదు''

''ఇది మాత్రం కాపీ డైలాగే''

''సరే. నా అసలు వయసు ముప్పై రెండు''

''మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు?'' సీరియస్‌గా చూస్తూ అడిగాడు.

''మీలాంటి మగాడు దొరక్క''

''అంటే పెళ్లైన మగాడా?''

''ఛ ఛ. మీ అంత మంచివాడు, అందగాడు దొరక్క''

''మీలో ప్రయత్న లోపం ఉంది. ప్రపంచంలో నాకంటే అందమైనవాళ్ళు, మంచివాళ్ళు లక్షల మంది ఉన్నారు''

''పోనీలెండి. బెటర్ లేట్ దేన్ నెవర్ అన్నారు''

''అంటే యిప్పుడు దొరికాడా?''

''అనే కదా అర్థం?''

''ఎవరో ఆ అదృష్టవంతుడు?''

''సమయమొచ్చినప్పుడు చెబుతాను. నాకు ఆఫీసుకు టైమౌతూంది. బై''

''ఇంతకూ ఇప్పుడెందుకొచ్చారో చెప్పలేదు''

''మిమ్మల్ని చూడాలనిపించింది. వచ్చాను. చూశాను. వెళ్తున్నాను. బై'' అంటూ వెళ్ళిపోయింది. తను విన్నది కలా, నిజమా అని ఆలోచిస్తూ ఉండిపోయాడు శశాంక.

★ ★ ★


రాత్రి పది గంటలకు గీతాంజలి యింట్లో ఫోన్ మ్రోగింది.

''హలో శశాంకగారూ''

''అరె. ఎలా గుర్తుపట్టారు అంత త్వరగా''

''స్పందించే వ్యక్తిని స్పందన ఉన్న వ్యక్తి వెంటనే గుర్తుపడుతుంది. ఎనీ వే థాంక్స్ ఎ లాట్''

''థాంక్స్ ఎందుకు?''



''రాత్రి పది గంటలకు, పెళ్ళై భార్యాపిల్లలున్న వ్యక్తి పరాయి ఆడదానికి ఫోన్ చేశాడంటే, అతనికి ఆ సమయంలో ఆ వ్యక్తి గుర్తొచ్చిందంటే అతని మనసులో ఓ మూల ఆ వ్యక్తి మీద అభిమానం, కన్సర్న్ ఉందనేగా. అందుకే థాంక్స్ చెప్పాను. ఇంతకూ ఎందుకు ఫోన్ చేశారో చెప్పలేదు''

''ఏం లేదు. మీకో సలహా ఇద్దామని''

''నన్ను వెంటనే పెళ్ళి చేసుకోమనేగా మీ సలహా''

''మీకు మైండ్ రీడింగ్ కూడా వచ్చా?''

''హార్ట్ మీటర్ రీడింగ్ కూడా వచ్చు. నా ఊహ నిజమైతే మీ గుండె యిప్పుడు నిమిషానికి నూట నలభైసార్లు కొట్టుకుంటూ ఉండి ఉంటుంది''

''బాప్‌రే. ఎంత కరెక్ట్‌గా చెప్పారు''

''నేను పెళ్ళి చేసుకోవాలంటే మీరు ఓ పని చేసి పెట్టాలి''

''చెప్పండి. వరుణ్ణి వెతకనా''

''వరుడు సిద్ధంగానే ఉన్నాడు. మీరు అతన్ని ఒప్పిస్తే చాలు''

''తప్పకుండా. ఎక్కడున్నాడు అతను'' శశాంక మనసులో అలజడి.

''అతనొక చార్టెడ్ అక్కౌంటెంట్. పేరు శశాంక''

శశాంక మనసు కుదుటపడింది.

''ఏమిటి మీరంటున్నది?'' చిరుకోపం నటించాడు.

''యస్. ఐ లవ్ యు. మీరు ఒప్పుకొంటే నేను పెళ్ళి చేసుకోవాలన్న మీ కోరిక తీరుతుంది. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలన్న నా కోరికా తీరుతుంది''

''నో. ఇటీజ్ ఇంపాజిబుల్''

''అయితే వదిలెయ్యండి. ఇంకెప్పుడూ నా పెళ్ళి ప్రస్తావన తేకండి''

''ఓ.కె. ఇట్సాల్‌రైట్'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

గీతాంజలి మనసులో తనున్నాడన్న విషయం శశాంకకు ఎంతో ఆనందాన్నిచ్చింది. అది తెలుసుకోవడానికే ఆమె పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు.

★ ★ ★

**సి.ఎన్.చంద్రశేఖర్**

''మీరు ఎల్.ఐ.సి. పాలసీ తీసుకొన్నారా'' శశాంక ఆఫీసుకొచ్చిన గీతాంజలి అడిగింది.

''మీరు ఏజెంటు కూడానా'' నవ్వుతూ అడిగాడు.

''కాదు. నా మంచి చెడ్డలు చూస్తున్న సంస్థ మంచి చెడ్డలు నేనూ చూడాలిగా. పైగా మాకూ ఆ బాధ్యతలు ఉన్నాయి''

''చాలా కాలం క్రిందట ఓ పాలసీ తీసుకున్నాను. యాభై వేలకు''

''చాలా తక్కువ. నా గుర్తుగా ఓ పాలసీ తీసుకోండి''

''కొత్త పాలసీలేవైనా ఇంట్రడ్యూస్ చేశారా?''

''మీరు ఓసారి మా యింటికి వచ్చారంటే నేను వివరంగా చెప్తాను''

''ఓరోజు సాయంత్రం రానా?''

''ఈరోజు ఏజెంట్స్‌తో ఓ చిన్న మీటింగ్ ఉంది. రేపు శనివారం కదా. సాయంత్రం రండి. నేను ఫ్రీగా ఉంటాను''



## సెక్సీ తార

**తెలుగు ప్రేక్షకులకి సిమ్రాన్‌ని ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. కట్టిపడేసే అందంతో అగ్రస్థాయి హీరోల సరసన నటించి తిరుగులేని హీరోయిన్‌గా నిలదొక్కుకుంది. అయితే కొత్తతారల విజృంభణ ఎక్కువైపోయిన తరుణంలో సిమ్రాన్ తెలుగు తెరనుంచి తమిళ రంగానికి తన ట్రాక్‌ని మార్చేసుకుంది. అవకాశాల కోసం ఆమె ఇప్పుడు తన అందానికి మెరుగులు దిద్దుకుంటోంది. తాజాగా తమిళ డైరెక్టర్ సూర్యతో హాట్ సీన్‌లో నటించి యువ ప్రేక్షకుల గుండెల్లో గుబులు రేపింది. ఈ సీన్ ఆ చిత్రానికే హైలైట్ అవుతుందంటున్నారు. తెలుగు ప్రేక్షకులు తనని మరిచిపోకుండా ఉండేందుకేమో మళ్లీ తెలుగులో 'సీతయ్య'లో నటిస్తోంది. త్వరలో విడుదల కాబోతున్న ఈచిత్రం ఆమె భవితవ్యాన్ని నిర్ధారించనుంది. 'మంచి కథ ఉంటే తెలుగులో నటించడానికి నేను సిద్ధమే' అంటోంది ఈ భామ.**

శనివారం సాయంత్రం పాలసీ గురించి మాట్లాడుకొన్నాక గీతాంజలి అంది.

''మీరు ఈమధ్య నా నుంచి దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోంది. నిజమేనా?''

''అవును''

''ఎందుకు?''

''మమతలు పెంచుకోవడం యిష్టం లేక''

''మీ భార్యాపిల్లల్తో కూడా యిలాగే వుంటున్నారా?''

''వాళ్ళు పూర్తిగా నా సొంతం''

''నేను పరాయిదాన్నా''

''పరాయి వాళ్ళేగా. రేపు మీరు వేరే ఊరికి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతే నన్ను మరిచిపోతారు. ఆ మర్చిపోవడాన్ని నేను భరించలేను. కనుక యిప్పట్నుంచే దూరమవుదామని ప్రయత్నిస్తున్నాను''

''మీరు నన్నర్థం చేసుకొన్నది యింతేనా?''

''కాదు. నన్నర్థం చేసుకోమని కోరుతున్నాను. మీతో అనుబంధం పెరిగిపోయి, అది ఎక్కడికి దారితీస్తుందో అని నా భయం''

''మీలాంటి మంచి వ్యక్తితో అనుబంధం ఏర్పడితే అంతకన్నా అదృష్టం ఏముంటుంది?''

''నిజంగా నాతో అనుబంధం పెంచుకోవాలని, నాతో స్నేహం కలకాలం ఉండాలని కోరుకొంటున్నారా?''

''చెప్పాగా. అది నా అదృష్టం అని''

''థాంక్యూ'' అంటూ ఆమె చేతిని అందుకొని అరచేతి వెనుక సున్నితంగా ముద్దు పెట్టాడు. ఆమె అభ్యంతర పెట్టలేదు. తనూ మధురమైన అనుభూతికి లోనైంది.

''నేను వెళ్తాను''

''వెళ్ళివస్తాను అనండి. మై డోర్స్ ఆర్ ఓపెన్ టు యు ఎట్ ఎనీ టైం, ఫర్ ఎవర్''

''థాంక్యూ. వెళ్ళివస్తాను''

''గుడ్‌నైట్''

★ ★ ★

తన యింట్లోకి అడుగుపెట్టిన శశాంకను చూసి ఆశ్చర్యపోయింది గీతాంజలి. చదువుతున్న పుస్తకం ప్రక్కన పెట్టి లేచి ఆహ్వానించింది.

''వాట్ ఎ సర్‌ప్రైజ్. ఆడబోయిన తీర్థం ఎదురైందంటారే. అలా యిప్పుడే మీకు ఫోన్ చేయాలనుకొన్నాను. మీరే వచ్చారు''

''ఏమిటి పని?''

''ప్రత్యేకంగా కారణం అంటూ లేదు. మీతో సంభాషణ ఓ టానిక్‌లా పనిచేస్తుంది''

''నిజంగా''

''నిజంగా నిజం''

సోఫాలో అతని ప్రక్కనే వచ్చి కూర్చుంది. అతని చేయి తీసుకొని తన అరచేతుల మధ్య ఉంచుకొని- ''మీకో చిన్న షాక్. నాకు హైదరాబాదు ట్రాన్స్‌ఫరైంది. అంతగా షాకవకండి. మా హెడ్ ఆఫీసులో మా నాన్నగారి ఫ్రెండ్స్ చాలామంది ఉన్నారు. నేను ఫోన్ చేసి చెప్పగానే ఆర్డర్స్ కేన్సిల్ చేయిస్తామని అన్నారు''

''అమ్మయ్య. నిజంగానే షాకయ్యాను. మిమ్మల్ని విడచి ఉండలేని స్థితిలో ఉన్నాను నేను''

''అంత బాధ ఎందుకు మీకు? ఇంట్లో మీ ఆవిడుందిగా. నేను దూరమయితేనేం?''

''మా యిద్దరు అమ్మాయిల్లో ఓ అమ్మాయి దూరంగా ఉంటే యింకో అమ్మాయి యింట్లో ఉంది కదా అని ఆ గ్యాప్ ఫీల్ కాకుండా ఉంటామా?''

''అంటే మీ ఆవిడతో సమానంగా

నన్ను ప్రేమిస్తున్నారా?''

''అవును''

''అది ఆమెను అన్యాయం చేసినట్లు కాదా?''

''కాదు. మన ప్రేమకు న్యాయం చేసినట్లు''

కొంతసేపు అతన్నే చూస్తూండిపోయింది గీతాంజలి. తర్వాత

''నిజం చెప్పండి. నాతో పరిచయం అయ్యాక, అది అనుబంధంగా మారాక సీతగారితో యిదివరకులా ఉంటున్నారా?''

''మీకెందుకా అనుమానం వచ్చింది? ఐ లవ్ హర్ వెరీమచ్''

''ఎందుకు ఆమె అంటే అంత ప్రేమ మీకు?''

''ఎందుకంటే ఆమె ఒక ప్రత్యేకమైన వ్యక్తి కనుక. సహనం, సంస్కారం, దయ, ప్రేమ సమానంగా కలిగిన అపురూపమైన స్త్రీ ఆమె.

భర్తంటే ఎంత ప్రేమో అంత నమ్మకం. ఒక చిన్న ఉదాహరణ చెబుతాను.

నేను ఆమెను స్కూటర్‌పై తీసుకుని వెళ్ళినా, కారులో తీసుకుని వెళ్ళినా ఏనాడూ ''కాస్త మెల్లగా నడపండి'', ''జాగ్రత్తగా నడపండి'' లాంటి సూచలు చెయ్యదు. అదే విషయం నేనడిగితే ''నన్ను జాగ్రత్తగా తీసుకెళ్ళాలని మీకూ ఉంటుంది. మీకు తెలిసిన బాధ్యతను నేను మళ్ళీ గుర్తుచేయడం ఎందుకు?'' అంటుంది. ఆమెకు నాపై ఉన్న నమ్మకానికి ఋజువు అది.''

''నిజమే. యు ఆర్ లక్కీ టు హేవ్ హర్. మరి నాతో అనుబంధం ఏర్పరచుకొని ఆమెకు అన్యాయం చేస్తున్నానని మీకు ఎప్పుడూ అనిపించ లేదా?''

''నిజాయితీగా చెప్పాలంటే ప్రతి క్షణం అనిపిస్తూంది. కానీ నేను ఎంత ప్రయత్నించినా మీకు దూరంగా ఉండలేకపోతున్నాను.

అయితే నేను మీ నుంచి ఏదీ వాంఛించడం లేదు మీ ప్రేమను తప్ప. ముడిపడిన మనసు విడివడలేక పడే బాధ ఇది. ముడి ఎందుకు వేశానో తెలియదు. విప్పడం చేతకావడం లేదు.

మనిద్దరిలోని భావసామీప్యత, మీ ఒంటరితనం, అతిగా స్పందించే నా హృదయం ఈనాటి మన పరిస్థితికి కారణాలు.

అయితే ఓ పరాయి ఆడదాని ప్రేమను, ఆమె నాపై చూపే ఆదరాన్ని ఎంజాయ్ చేస్తున్నాను. ఒక విధంగా యిది నా స్వార్థమే. మీ ప్రేమను రుచి చూసిన నాకు ఆ ప్రేమను దూరం చేసుకోవాలని లేదు''

''మరి మన సమస్యకు పరిష్కారం?''

''ఇది సమస్య కాదు. చిన్న యిబ్బంది. మనం ముందే ఊహించినది. కోరుకున్నది కూడా. మీరు దీని గురించి మనసు పాడుచేసుకోకండి. అన్నీ సాఫీగా జరిగిపోతాయి. నేను వెళ్ళి వస్తాను''

''బై'' అంది అతను వెళ్ళిన వైపే చూస్తూ.

★ ★ ★

ఆ ఆదివారం కల్చరల్ ప్రోగ్రాంకు సీత ఒక్కతే రావడం చూసి ఆశ్చర్యపోయింది గీతాంజలి.

''ఏరీ మీ వారు?''

''అర్జెంటు పనిమీద హైదరాబాదు వెళ్ళారు''

''పిల్లల్ని తీసుకొని రావల్సింది''

''వాళ్ళకు ఇంట్రెస్ట్ లేదు. ఎప్పుడూ చదువులు, పరీక్షలు అంటారు'' ఇద్దరూ పక్క పక్కనే కూర్చున్నారు.

''మీ వారికి మీరంటే చాలా యిష్టం''

''మీతో చెప్పారా'' సిగ్గుపడుతూ అంది.

''మీకూ అంతేనా?''

''అంతే కదా. ఆయన మంచి మనసు కలవారు. అందరితో బాగా కలిసి ఉంటారు. పైగా నన్ను ఎంతగానో ప్రేమిస్తారు. ఏ ఆడదైనా భర్త నుంచి అంతకంటే ఏం కోరుకొంటుంది? ఆయన వల్ల తలదించుకొనే పరిస్థితి నాకింతవరకూ రాలేదు. అంత మంచి ప్రవర్తన కలవారు ఆయన. నా సంతోషం కోసం, ఆనందం కోసం ఏమైనా చేస్తారు. నాకు కవలలు కనుక కాన్పు చాలా కష్టమైంది. మా వదిన వచ్చి కాన్పు అయిందని చెప్పగానే అక్కడే ఉన్న మా అమ్మానాన్నలు, అన్నయ్యలు 'ఏ బిడ్డ' అని ఆత్రంగా అడిగారట. కానీ ఆయన మాత్రం 'సీతకెలా వుంది' అని ఆదుర్దాగా అడిగారట. ఆ విషయం మా అన్నయ్యలు యిప్పటికీ గుర్తు చేసుకొంటూ 'సీతా మీ ఆయనకు నువ్వంటే చాలా ప్రేమ' అంటూంటారు''

''యు ఆర్ వెరీ లక్కీ టు హేవ్ హిమ్''

''యస్''

★ ★ ★

ఆ రోజు గీతాంజలి ఆఫీసుకు ఫోన్ చేసిన శశాంకకు ఆమె రిలీవై, హైదరాబాదుకు వెళ్ళిపోయిందని చెప్పారు. శశాంక ఆ వార్త తట్టుకోలేకపోయాడు. ఆఫీసులో ఉండలేక యింటికి బయలుదేరబోతూంటే కొరియర్ అతను ఓ ఉత్తరం తెచ్చి యిచ్చాడు.

గీతాంజలి రాసింది. కవరు చించి ఉత్తరం చదవసాగాడు.

శశాంకగారికి,

నేను ఆరోజు కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో మిమ్మల్నీ, సీతగారినీ చూశాక ఆవిడంటే ఎంతో అసూయ కలిగింది. ఎలాగైనా మిమ్మల్ని నా చుట్టూ త్రిప్పుకోవాలని, మీరూ మామూలు మగవారేనని నిరూపించాలని అనుకొన్నాను. అందుకే మీకు ఫోన్లు చేసి, మీ అందాన్ని పొగిడి మిమ్మల్ని నా వలలో వేసుకొన్నాను. అయితే అంతటి వ్యక్తి అలా బేలగా నావైపు చూస్తూ, నా చుట్టే తిరుగుతూంటే నా మనసు కలచివేసినట్లవుతూంది. ప్రేమకు ఎంత శక్తి ఉందో కూడా అర్థమైంది.

నిజానికి యిందులో మీ తప్పులేదు. మీరొక ప్రేమ పిపాసి. భగవంతుడు భక్తికి వశమైనట్లు మీరు ప్రేమకు వశమౌతారు.

అయితే సరదాగా ఈ ఆట ప్రారంభించిన నేను మీ ప్రేమకు లొంగిపోయి, మనసంతా మిమ్మల్నే నింపుకొన్నాను.

గత ఆదివారం సీతగారితో మాట్లాడాక, మీపై ఆమెకున్న నమ్మకం గురించి తెలిశాక యిక నేను మీ మధ్యలో ఉండకూడదనుకొన్నాను. రాముడు సీతతో ఉంటేనే వాళ్ళది అందమైన జంట. అందరికీ ఆదర్శనీయమైన జంట. మీరూ అలాగే ఉండాలి. ప్రేమ సర్వజన రంజకంగా ఉండాలి. ఎవరినీ బాధించకూడదు.

అందుకే నా ట్రాన్స్‌ఫర్ కేన్సిల్ చేసుకోకుండా మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను.

నా ఆబ్సెన్స్ వల్ల కలిగే గ్యాప్ మీకు కొద్దిరోజులుండవచ్చు. తర్వాత మీరే సర్దుకొంటారు.

నా మనసులో మీ రూపం శాశ్వతంగా ఉండిపోతుంది. మీ కోరిక కూడా అదే కదా. మీరాబాయి కృష్ణుడిని భర్తలా భావించి కొలిచింది. ఆయన భక్తి పారవశ్యంతో ఓలలాడింది.

అలా నా ప్రేమ సామ్రాజ్యంలో హీరో మీరే.

నా ఊపిరి ఉన్నంతవరకూ నేను మీ ప్రియురాలినే. మీ జీవితంలో ఓ గాలి తెమ్మెరలా ప్రవేశించి అంతే నెమ్మదిగా మాయమవుతున్న

ఎప్పటికీ మీ

గీతాంజలి.

✤

